క్లుప్తంగా

సైకిల్ స్టాండ్ ప్రారంభం



సైకిల్‌స్టాండ్ ప్రారంభిస్తోన్న డాక్టర్ బళ్ల మురళి

నరసాపురం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని నరసాపురం తులసీ ఆసుపత్రి ఎండీ డాక్టర్ బళ్ల మురళి సూచించారు. తులసి ఆసుపత్రి ఆర్థిక సహాయంతో మండలంలోని సారవగ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.50వేలతో నిర్మించిన సైకిల్‌షెడ్డును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారం ఉంటేనే ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిని అందుకోగలవని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.బాలనాగమణి, ఎస్ఎంసీ చైర్మన్ గన్నాబత్తుల వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ కడలి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 24 నామినేషన్లు



నామినేషన్‌లు స్వీకరిస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేయడానికి మొత్తం 24 మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసెఫ్ తెలిపారు. ఈ నెల 13న నిర్వహించే ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేయడానికి మంగళవారంతో గడువు ముగిసింది. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల మత్స్యవల్లభరావు, బూసి విశ్వేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, వైదాని నాగేశ్వరరావుతో సహా ఇతర పదవులకు మరో 20 మంది నామినేషన్లు దాఖలు చేశారని జోసెఫ్ వివరించారు.

చెత్త సేకరణలో జాగ్రత్తలు పాటించాలి



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలో చెత్త సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో పట్టణంలో చెత్తసేకరణపై సమీక్ష నిర్వహించారు. శానిటరీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. డ్రైయిన్స్‌లోనూ, కాలువల్లోనూ చెత్త వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా మూడు డస్ట్ బిన్స్‌లో భద్రపరిచి అందించే విధంగా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. నరసాపురం క్లీన్ పట్టణంగా రూపుదిద్దే ప్రయత్నంలో ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా శివ సహస్ర నామార్చన



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారాల ప్రదక్షిణలో భాగంగా ఏడు వారాలు ప్రదక్షిణలు పూర్తయిన భక్తులు మంగళవారం శివ సహస్రనామార్చనలు చేయించుకున్నారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 80 మంది దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వీరబాబు పాల్గొన్నారు.

రేపు చేనేత వస్త్ర ప్రదర్శన



సమావేశంలో పాల్గొన్న చేనేత సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం వివిధ రకాల చేనేత వస్త్రాల ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు సంఘ అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వీవర్స్ కాలనీలో కమ్యూనిటీ హాలులో మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గణేశ్వరరావు మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రోత్సహించే విధంగా ప్రదర్శన అమ్మకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిభ ఉన్న చేనేత కులాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నామన్నారు. సెక్రటరీ నీలంశెట్టి సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, శాగా రాంబాబు, బాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలి



యలమంచిలి: విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



పెనుమంట్ర: సబ్‌స్టేషన్‌లో విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



పెనుగొండ: తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రజలపై విద్యుత్ భారాల దోపిడీని ఆపాలని, ఆదానీ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుల వివక్షత పోరాట సమితి జిల్లా నాయకులు కానేటి బాలరాజు మాట్లాడుతూ విద్యుత్ భారాన్ని తగ్గిస్తామని గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అధికారంలోనికి వచ్చిన తర్వాత వేల కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపుతుందని విమర్శించారు. అదనంగా ఆదానీ స్మార్ట్ మీటర్లను బిగించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. దీనిని ప్రజలంతా ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, బాతిరెడ్డి సుగుణ, ఎం.ఆంజనేయులు, శెట్టిమి భాస్కరరావు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: ప్రజలపై విద్యుత్ భారాలు మోపవద్దని, ఆదానీ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని మంగళవారం ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెనుమంట్ర తహసీల్దార్, విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక మాయమాటలు చెప్పి ఇప్పుడు ప్రజలను మోసగిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లారైతు సంఘం అధ్యక్షుడు ఆకుల హరేరాం, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, సీఐటీయూ నాయకులు కేతా గోపాలం, నేతల చిత్తరంజన్, కోడి శ్రీనివాస ప్రసాద్, గంటి ఆంజనేయులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు కోరారు. స్మార్ట్‌మీటర్లు రద్దు కోసం ప్రజావేదిక ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ జి.అనితకుమారికి వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాట మార్చి స్మారట్‌మీటర్లను ఏర్పాటు చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్కే పాదుషా, నీలాపు ఆదినారాయణ, గుడిమెట్ల వరహాల రెడ్డి, శీలం ఏసు పాల్గొన్నారు.

ఆచంటలో

నివాస గృహాల్లో మోసపూరితంగా ఆదానీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ప్రజావేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఆచంట కచేరీ సెంటర్‌లో ధర్నా నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు, సీపీఎం నాయకులు తలిపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, బండి రంగరావు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్మార్ట్ మీటర్ల విధానం తొలగించి పాత విధానమే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దర్నా నిర్వహించి డీటీ ఎన్‌బీకే దుర్గకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌గోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మేమొస్తే కరెంటు చార్జీలు పెంచమని, స్మార్ట్ మీటర్లు పెట్టమని చెప్పి ఇప్పుడు గత ప్రభుత్వ విధానాన్నే అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, యర్రా అజయ్‌కుమార్, టి.గంగరాజు, ఇరగవరపు రాజు, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన



అవగాహనా ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం రూరల్: ప్రజల చేతులో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో దాసిరాజు అన్నారు. మంగళవారం యర్రంశెట్టివారిపాలెం గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దాసిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరంలేదన్నారు. సెల్‌ఫోన్‌లో ఉండే వాట్సాప్ ద్వారా 200కి పైగా ప్రభుత్వ సేవలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ, తహసీల్దార్ అయితం సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. మంగళవారం పెనుగొండ పంచాయతీ నుంచి వాట్సప్ గవర్నెన్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి, జి.భార్గవ్‌నాయుడు, జేఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

తెలుగు అధ్యాపకుడికి అరుదైన గౌరవం



బెంగుళూరు విశ్వవిద్యాలయంలో వెంకటస్వామిని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు బూసి వెంకటస్వామి బెంగుళూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు అధ్యక్షత స్థానం వహించారు. గత రెండు రోజులుగా నిర్వహించిన ఆచార్య కె.ఆశాజ్యోతి సాహిత్యం, సమాలోచన రెండు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ సదస్సులో ఆచార్య కె.ఆశాజ్యోతి మాతంగి దివిటీ పాత్రచిత్రణ అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సదస్సులో ఓ సమావేశానికి తనకు అధ్యక్ష స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమం అనంతరం బూసి వెంకటస్వామిని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, కళాశాల అధ్యాపకులు తదితరులు వెంకటస్వామిని అభినందించారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు



ఆచంటలో వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

నరసాపురం: అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఏపీయూడబ్ల్యూజే నరసాపురం శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం జర్నలిస్ట్‌ల కోర్కెల దినోత్సవం సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో విలేకరులు నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నరసాపురం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తరపట్ల ఇజ్రాయిల్, నాయుడు మారుతీరావు మాట్లాడుతూ అక్రిడేషన్‌ల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. అర్హులైన విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సాక్షి రంగా, మద్దాల మురళి, అంజూరి చిన్నారావు, చేరుగొండి వెంకటేశ్వరరావు, కరిశెట్టి శ్రీనివాస్, శ్రీనివాస్, తమ్మిశెట్టి బాబు, దివి వెంకటేశ్వరరావు, కుమార్, పండు, రాజేష్, సందీప్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: వర్కింగు జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు జారీ చేయడంలో జాప్యంతో పలు సదుపాయాలు కోల్పోతున్నారని ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా ఆచంటలో తహసీల్దారు జి.కనకరాజుకు వినతి పత్రం సమర్పించారు. సత్వరం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు షణ్ముక్, సుకుమార్, వనం సత్యనారాయణ, రాంబాబు, నవీన్, ఆర్‌కే రెడ్డి, జవ్వాది మోహన్, నాగేశ్వరరావు, సతీష్,ఉపేంద్ర, అంజి, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి



యలమంచిలి: మేడపాడు తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రతి తల్లి కూడా తల్లిపాలు ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని మేడపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ నరేష్ కోరారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం మేడపాడు గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార విద్య, తల్లిపాలు ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహార పద్ధతుల గురించి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జి.రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈఓ మురుకుర్తి శివకుమార్ పాల్గొన్నారు.

ముర్రిపాలుతో రోగ నిరోధక శక్తి మెరుగు

పెనుగొండ: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రి పాలు తాగించడం ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి ఎస్.వినోద్ అన్నారు. తల్లి పాలు వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో తల్లి పాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.శ్యామలాంబ, డి.సూర్య కుమారి, టి.పోచమ్మ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: బిడ్డకు తల్లి మురిపాలు ఇవ్వడం వల్ల తల్లితో పాటు బిడ్డ కూడా ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మణిత్యాగిని అన్నారు. మంగళవారం అర్బన్ యూపీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మణిత్యాగిని మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఎం.ఉమ, హెచ్‌ఈపీయూ సీతామాలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యవేణి పాల్గొన్నారు.



పెనుగొండ: ఆచంట వేమవరంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

మార్టేరులో..

పెనుమంట్ర: అధికారుల సమన్వయంతో పనిచేసి తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించాలని సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. మార్టేరు, ఆలమూరు పీహెచ్‌సీల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు మల్లిక, అనిల్‌కమార్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని సీడీపీఓ ఊర్మిళ అన్నారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి తల్లిపాల వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.విజయకుమారి, ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

పెనుగొండ: స్థానిక చెరుకువాడ శ్రీ భూ చెన్న కేశవ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా కౌరు శ్రీనివాస్, సభ్యులుగా మునుభర్తి శ్రీమణి, అడబాల చంద్రావతి, అడవి శ్రీలత తదితరులతో దేవదాయ శాఖాధికారులు ప్రమాణం చేయించారు.

ఫీడింగ్ రూమ్ ఏర్పాటు

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయంలో మంగళవారం బేబీ ఫీడింగ్ రూమ్‌ని ఉమెన్ చైల్డ్‌వేల్ఫేర్ రీజనల్ జేడీ బి.సుజాత ప్రారంభించారు. ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

సొసైటీలో అవకతవకలపై విచారణ



అవకతవకలపై వివరిస్తున్న సొసైటీ చైర్మన్ దేగల సత్యనారాయణ

యలమంచిలి: నారినమెరక సొసైటీలో జరిగిన ఆర్థిక అవకతవకలపై విచారణ జరుగుతుందని, రైతులు తమ బాకీలను సరి చూసుకోవాలని సొసైటీ త్రిసభ్య కమిటీ నూతన చైర్మన్ దేగల సత్యనారాయణ (సత్తికొండ) కోరారు. సొసైటీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొసైటీపై సెక్షన్ 52 విచారణ జరుగుతున్న విచారణ సగం అయ్యిందన్నారు. ఇంతవరకు జరిగిన విచారణలో కార్యదర్శి శ్రీనివాస్‌తో గోల్డ్ లోన్ రూ.10 లక్షలు, ఇతర దీర్ఘ కాలిక రుణాలు కింద రూ.17, 25, 391 తిరిగి కట్టించారన్నారు. మిగిలిన రైతులు కూడా తమ బాకీలను సరిచూసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు యేడిద నారాయణరావు, పూర్ళ్ల మాణిక్యాలరావు, విచారణ అధికారి కప్పల జోసఫ్ పాల్, యలమంచిలి డీసీసీబీ మేనేజర్ వి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

క్షీరపురి అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం

- ఆగస్టు 31 లోపు ప్రణాళికపై సలహాలు, అభ్యంతరాల స్వీకరణ
- ప్రతిపాదనలు విడుదల చేసిన యుడా



క్షీరపురి పట్టణంలో ఓ భాగం



మాస్టర్ ప్లాన్ 2045 పట్టణ మ్యాప్

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో 2045 నాటికి క్షీరపురి పట్టణ వైభవం మరింతగా అభివృద్ధి చెందడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ (యుడా) పాలకొల్లు మునిసిపాలిటీ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకటన విడుదల చేసింది. అలాగే ఈ ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనలు కోరుతుంది. 1920లో 4.68 విస్తీర్ణంతో పాలకొల్లు పురపాలక సంఘంగా ఏర్పడింది. అయితే ప్రస్తుతం 2045కు అభివృద్ధి ప్రణాళికలను (మాస్టర్ ప్లాన్) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఆఫ్ ఇండియా, ఏపీ రీజియన్ చాప్టర్ (ఐటీపీఐ, ఏపీఆర్‌సీ) బృందం తయారు చేశారు.

పెండింగ్‌లోనే విలీన గ్రామాల సమస్య

2020–21లో పట్టణానికి సమీపంలోఉన్న కొంతే రు, ఉల్లంపర్రు, పాలకొల్లు రూరల్, పూలపల్లి, వరిధనం, భగ్గేశ్వరం, అడవిపాలెం గ్రామాలను పట్టణంలో విలీనం చేస్తూ ప్రణాళికను సిద్ధం చేశారు. విలీనం కోసం పంచాయితీలన్నీ తీర్మానం చేసి లెటర్లు ఇచ్చారు. అడవిపాలెం, కొంతేరుకు చెందిన కొందరు విలీన ప్రక్రియను అడ్డుకుంటూ కోర్టును ఆశ్ర యించడంతో ఈ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. దీంతో మునిసిపల్ ఎన్నికలుకూడా వాయిదా పడ్డాయి. ఈ 7 గ్రామాలు కలిస్తే పట్టణం విస్తీర్ణం ప్రస్తుతం ఉన్న 4.68 తో కలిపి మొత్తం 25.8 కి.మీ మేర పెరుగుతుంది. గతంలో పట్టణంలో మునిసిపల్ వార్డులు 31ఉండేవి. విలీన గ్రామాలను (లీగల్ సమస్యతో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నా యి) కలుపుతూ 35 వార్డులుగా విభజించారు.


78 కి.మీ మేర పెరగనున్న విస్తీర్ణం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఆఫ్ ఇండియా, ఏపీ రీజియన్ చాప్టర్ (ఐటీపీఐ, ఏపీఆర్‌సీ) బృందంచేసిన అభివృద్ధి అంచనాల్లో భాగంగా పాలకొ ల్లు నియోజకవర్గంలో పాలకొల్లు మండలంలో కాపవరం, చింతపర్రు, లంకలకోడేరు, వరిధనం, చందపర్రు, పాలకొల్లు అర్బన్, ఉల్లంపర్రు, పూలపల్లి, పాలకొల్లు రూరల్, యలమంచిలి మండలంలో కొంతేరు, పోడూరు మండలంలో జిన్నూరు, మట్టపర్రు, పెనుమదం ఈ మూడు మండలాల్లో కలిపి సుమారు 14 గ్రామాలు ఈ మాస్టర్ ప్లాన్‌లో కలవనున్నాయి. ఈ గ్రామాలతో మరో 53 కి.మీ మేర విస్తీర్ణం పెరుగుతుంది. అంటే మొత్తం విలీన గ్రామాలతో కలిపి 2045 నాటికి 78 కి.మీ వరకూ పట్టణం అభివృద్ధి జరిగేలా ప్రణాళికలను తయారు చేశారు.

పట్టణానికి రింగ్ రోడ్డు ప్లానింగ్ ....

పట్టణంలో పూలపల్లి బైపాస్ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి వేసినా పట్టణంలో రైల్వే గేటు సెంటర్ మాత్రం నిత్యం రద్దీగానే ఉంటుంది. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పట్టణంలో బ్రాడీపేట బైపాస్ రోడ్డు, పూలపల్లి బైపాస్ రోడ్డులు ఉన్నాయి. ఈ రహదారులు పట్టణాన్ని పూర్తిగా కలుపుకుని వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. పూలపల్లి బైపాస్ రోడ్డు నుంచి నర్సాపురం రోడ్డు మీదుగా రూరల్ పంచాయితీ, చిత్రావి చెరువుగట్టు, లయన్స్ నగర్, వరిదనం రోడ్డు మీదుగా దొడ్డిపట్ల రోడ్డుకు కలపాలి. అక్కడి నుంచి బ్రాడీపేట బైపాస్ రోడ్డును కలుపుతూ బ్రాడీపేట నుంచి పూలపల్లి బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేయాలి. బ్రాడిపేట బైపాస్ రోడ్డు నుంచి పూలపల్లి బైపాస్ రోడ్డుకు కలపాలంటే ఉల్లంపర్రు మీదుగా నాగరాజు పేట, సత్యసాయి కాలనీ, గొల్లలకోడేరు రోడ్డు మీదుగా రైల్వే ట్రాక్ దాటి పూలపల్లి బైపాస్ రోడ్డుకు కలుపుకోవాలి. గొల్లలకోడేరు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబి) ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

20 ఏళ్ల అభివృద్ధికి అనుగుణంగా..



రాబోయే 20 ఏళ్లకు భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికను తయారు చేశారు. 2022 నుంచి దీనిపై వివిధ సర్వేలను నిర్వహించాం. ప్రస్తుతం డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ ప్రకటించారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఉంటే వాటిని ఆగస్టు 31లోపు ఈ–మెయిల్ ద్వారా గానీ, నేరుగా గాని దరఖాస్తు చేయవచ్చు. దరఖాస్తులు పరిశీలన అనంతరం తుది మాస్టర్ ప్లాన్‌ను నిర్ణయిస్తారు.

– వీరబ్రహ్మం, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి, పాలకొల్లు

ఈ–పంట నమోదు తప్పనిసరి

ఉండి: వరినాట్లు వేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ–పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏడీఏ ప్రతాప్‌జీవన్ తెలిపారు. మంగళవారం ఉణుదుర్రు గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతిరైతూ ఎకరాకు రూ.210 ప్రీమియం చెల్లించి పంట బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.నాగలక్ష్మి, గ్రామపెద్దలు రాఘవులు, నాగరాజు, వీఏ భానుప్రకాష్, రైతులు దాట్ల వెంకటేశ్వరరాజు, మండలపాటి శివరామకృష్ణ పాల్గొన్నారు.